# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 90 | విశాఖపట్నం | 30-12-2025 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 90 | VISAKHAPATNAM | 30-12-2025 TUESDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు
# ఏపీ క్యాబినెట్ ఆమోదం



- జనవరి 1 నుంచి కొత్త మార్పులు అమల్లోకి
- మొత్తం 24 కీలక అంశాలపై చర్చించి.. ఆమోదించిన మంత్రివర్గం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం

**అమరావతి, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. దాదాపు 20కి పైగా అజెండా అంశాలపై సమావేశంలో చర్చించారు. జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకుంది. రాజంపేటను కడపకు మార్చే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైల్వేకోడూరును తిరుపతికి మార్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో రాష్ట్రంలో 28కి జిల్లాల సంఖ్య పెరగనుంది. ఎల్లుండి తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. గూడూరును తిరుపతి జిల్లా నుంచి నెల్లూరులో కలిపేందుకు, కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అన్నమయ్య జిల్లాను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ జిల్లాలో మిగిలిన రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాలను మూడు జిల్లాల్లో కలపాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు స్పష్టత ఇచ్చింది. వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు చెరుకూరి శ్రీధర్, నిశాంత్ కుమార్‌లను అమరావతికి ఆదివారం పిలిపించారు. తుది ఉత్తర్వులు ఇవ్వడానికి వీలుగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ఇద్దరు కలెక్టర్లు అమరావతిలోనే మకాం వేశారు. మంత్రివర్గ సమా వేశంలో జిల్లాల పునర్విభజన అంశంపై చర్చలు జరిగాయి. ఈ సమావేశం జరుగుతున్న సమయంలో రాయచోటి ఎమ్మెల్యే, మంత్రి మండిపల్లి రాంప్రసాద్? రెడ్డి అన్నమయ్య జిల్లాను విభజించి మిగతా జిల్లాలలో కలపడంపై మనస్థాపం చెందారు. సమావేశంలోనే (తరువాయి 2వ పేజీలో)

## ప్రజాభీష్టం మేరకే జల్లాల్లో
# మార్పులు: మంత్రులు




**అమరావతి, పతాకం న్యూస్:** క్యాబినెట్‌లో 24 అంశాలను చర్చించి ఆమోదం తెలిపినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనో హర్, సత్యకుమార్‌తో కలిసి అనగాని వెల్లడించారు. సాంఘిక సంక్షేమ శాఖలో రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కల్పించామన్నారు. ప్రభుత్వ కార్యాల యాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆమోదించామన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లాల ఏర్పా టులో మార్పులు, చేర్పులు చేసినట్లు తెలిపారు. 9 జిల్లాల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదని, 17 జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడించారు. ప్రజల కోరిక మేరకు డివిజన్లు, మండలాలు మార్చామన్నారు. గత ప్రభుత్వం సరిగా ఆలోచించకుండా జిల్లాల విభజన చేసిందని విమర్శిం చారు. పోలవరం పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాయ చోటిని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రి మండిపల్లిని పిలిచి సీఎం చంద్రబాబు ఓదార్చారని అనగాని వెల్లడించారు. గతంలో పారదర్శకంగా చేసుంటే ఈ సమస్యలు వచ్చేవి కావని మంత్రులు నాదెండ్ల, సత్యకుమార్ వ్యాఖ్యానించారు. 'ఆర్థిక సమస్యలు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం ముందు కెళ్తున్నాం. గతంలో జరిగిన విధ్వంసకర చర్యలను సరి చేస్తున్నాం. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించే దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. మౌలిక వసతుల కోసం దాదాపు రూ. 3 లక్షల కోట్లను ఖర్చు చేస్తున్నాం. కొప్పర్తి, ఓర్వకల్లుకు పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రోడ్డు వెళ్తుంది. కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది. గత ప్రభుత్వం మాదిరిగా పథకాలకు తమ పేర్లను కాకుండా మహనీయుల పేర్లను పెడుతున్నాం. దీనిపైనా మంత్రివర్గంలో చర్చ జరిగింది" అని మంత్రి సత్యకుమార్ తెలిపారు. " కేబినెట్‌లో 24 అంశాలపై చర్చించి ఆమోదించాం. జిల్లాల పునర్విభజనపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించాం. 9 జిల్లాల్లో మార్పులు (తరువాయి 2వ పేజీలో)



కోడి పందేలకు సిద్ధమవుతున్న గోదావరి జిల్లాలు..

5లో



పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు ఎలా కరుగుతుంది?

6లో

# ఏపీలో నేరాలు బాగా తగ్గాయి
## డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

**అమరావతి, పతాకం న్యూస్:** గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. 2025 సంవత్సరానికి సంబంధించి పోలీసుల పనితీరుపై రూపొందించిన ప్రత్యేక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీజీపీ, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ మంచి పురోగతి సాధించిందని తెలిపారు. ప్రత్యేకంగా మహిళల భద్రత విషయంలో పోలీసుల చర్యలు ఫలితాలు ఇచ్చాయని డీజీపీ చెప్పారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో, వేధింపుల కేసులను వేగంగా పరిష్కరించడంలో పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అలాగే మత్తు పదార్థాల రవాణాపై దృష్టి సారించి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను కట్టడి చేయడంలో కూడా గణనీయమైన విజయాలు సాధించామని చెప్పారు. దొంగిలించిన మొబైల్ ఫోన్లను రికవరీ చేయడంలో సాంకేతికతను ఉపయోగించి వేల సంఖ్యలో ఫోన్లను బాధితులకు తిరిగి అందించామని వివరించారు.రాబోయే రోజుల్లో పోలీసింగ్ వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ స్పష్టం చేశారు. వచ్చే పదేళ్లలో పోలీసింగ్ ఎలా ఉండాలి? ఎలాంటి మార్పులు అవసరం? సాంకేతికతను ఎలా వినియోగించాలి? అనే అంశాలపై రెండు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత ఈ వర్క్‌షాప్ జరగనుందని, ఇందులో పోలీసు విధుల్లో మార్పులు, ఆధునిక టెక్నాలజీ వినియోగంపై లోతైన చర్చలు జరుగుతాయని చెప్పారు. ప్రజలు నిజంగా కొత్త పోలీసింగ్ విధానాన్ని ప్రత్యక్షంగా చూడగలిగేలా ఈ కార్యక్రమం ఉంటుందని అన్నారు.






ఏపీలో కొత్తగా 707 మొబైల్ టవర్లు!

7లో



శ్రీవారి ఆలయం ముస్తాబు.. అర్ధరాత్రి నుంచి తెరుచుకోనున్న వైకుంఠ ద్వారాలు

2లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## కుటుంబం

ఆదిమ మానవుని అవతరణ నుంచి నాగరిక మానవుని ఆవిర్భావం వరకు నడిచిన వేల సంవత్సరాల చరిత్రలో కుటుంబ రూపంలో వచ్చిన అనేక మార్పులు, స్వంత ఆస్తి ఏర్పడటం, తల్లి హక్కు పోయి, తండ్రి హక్కు ఏర్పడటం, తత్ఫలితంగా స్త్రీ జాతిపై పురుషాధిపత్యం నెలకొనడం వంటి అనేక విషయాలను 'కుటుంబము-స్వంత ఆస్తి, రాజ్యముల ఆవిర్భావం' అనే గ్రంథంలో వివరిస్తాడు ఏంగెల్స్. నాటి నుంచి నేటి వరకూ ప్రపంచం ఎంత వేగంగా మారుతున్నా, సాంకేతికత ఎంత ఎత్తుకు ఎదుగుతున్నా% మనిషిని మనిషిగా నిలబెట్టే మూలస్తంభం కుటుంబమే. వ్యక్తి మొదట నేర్చుకునే భాష, భావం, విలువలు, బాధ్యత- అన్నీ కుటుంబం నుంచే మొదలవుతాయి. భారతీయ సంస్కృతిలో కుటుంబం అనేది ఒక విలువల పాఠశాల. ఈ భావనలో ప్రపంచాన్నే ఒక కుటుంబంగా చూసే తత్వం దాగి వుంటుంది. 'దేశమంటే మట్టి కాదోరు/ దేశమంటే మనుషులోరు' అంటారు గురజాడ. కుటుంబం బాగుంటేనే మనిషి బాగుంటాడు. మనిషి బాగుంటేనే దేశం నిలబడుతుంది. అయితే, నేటి సమాజంలో కుటుంబం కేవలం ఒక చిరునామాగా మారిపోతోంది. ఒకే ఇంట్లో వుంటూ.. ఒకరికొకరు అపరిచితుల్లా ఎవరి ధోరణిలో వారు యాంత్రిక జీవనస్థితి పెరుగుతోంది. 'మాట మానేస్తే మనిషే మిగలడు' అంటారు కాళోజీ. మనిషి చుట్టూ వుండే మొదటి ప్రపంచం% కుటుంబం. ఆ కుటుంబాల్లో మాటలు తగ్గితే, అనుబంధాలు చనిపోతాయి. తాత, అమ్మమ్మ మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు, నాలుగు తరాలు ఒక ఉమ్మడి కుటుంబంలో వుండేవి. ఇంట్లోని పెద్దకు అందరూ గౌరవిస్తూ, ఆయన మాటే వేదంగా భావించేవారు. ఈ పెద్దల సంరక్షణలో పిల్లలు అన్ని విషయాలూ తెలుసుకునే వారు. కుటుంబంలోని అందరూ కష్టసుఖాలను పంచుకుంటూ ఆత్మీయులుగా వుండేవి. కానీ, నేడు ఎన్నో ఉమ్మడి కుటుంబాలు చిన్న కుటుంబాలుగా మారాయి. మరోవైపు దేశానికి జనాభాయే ఆస్తి అని, దంపతులు ముగ్గురు నలుగురు పిల్లలను కనాలని మన నాయకులు ఉపదేశాలిస్తున్నారు. ఎందరిని కనాలనేది ఆ దంపతుల ఇష్టంపై ఆధారపడి వుంటుంది. ముఖ్యంగా మహిళల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, కంటెంట్‌ను మార్కెటీకరించినట్లుగా జనాభాను కూడా మార్కెటీకరించి వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత వినిమయదారీ తత్వం పెద్దఎత్తున పెరిగింది. అది కుటుంబాలలో విలాసవంతమైన జీవనానికి, విచ్చలవిడితనానికి దారితీస్తోంది. మనకు అవసరం లేకపోయినా, పొరుగువారికి వుంది కాబట్టి, మనకూ వుండాలనే ధోరణి%అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోంది. ఫలితంగా ఉమ్మడి కుటుంబాలు వ్యష్టి కుటుంబాలుగా మారుతూ తలోదిక్కూ పోతున్నారు. ఈ క్రమంలో కుటుంబాల్లో వృద్ధుల సంరక్షణ ప్రధాన సమస్యగా మారింది. వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్న కొద్దీ వారిలో ఆందోళన కూడా పెరుగుతోంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు బాసటగా నిలవాల్సిన పిల్లలు.. ఆ బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. తమ జీవితమంతా కుటుంబం కోసం పరితపించిన పెద్దలు తమ చరమాంకంలో వృద్ధాశ్రమాల్లో అనాథలుగా బతుకులీడ్చే పరిస్థితికి నేటి కుటుంబ వ్యవస్థ నెట్టబడింది. 'మూలాలను మరిచిన వృక్షం ఎక్కువకాలం నిలబడదు' అంటారు శేషేంద్ర శర్మ. వృద్ధులను విస్మరించే కుటుంబమైనా, సమాజమైనా ఎక్కువ కాలం నిలబడదు. ప్రపంచం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్న వేళ, మనిషి మానవ సంబంధాల విషయంలో తిరోగమనంలో వున్నాడు. ఆర్థిక గణాంకాల్లో కనిపిస్తున్న ప్రగతి%కుటుంబ బంధాల్లో మసకబారుతోంది. ఈ పరిణామాల క్రమంలో జనవరి 1న జరుపుకునే 'గ్లోబల్ ఫ్యామిలీ దినోత్సవం' ఒక ఉత్సవంగా కన్నా, ఒక హెచ్చరికగా ఎన్నో ప్రశ్నలను మన ముందుంచుతోంది. మన ఇళ్లలో ప్రేమ వుందా? సంభాషణ వుందా? పరస్పర గౌరవం వుందా? ఇంట్లోని ఒక్కో వ్యక్తి, ఒక్కో దీవిలా మారిపోయారా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతక్కపోతే, రేపటి సమాజం మరింత ఒంటరిగా, వృద్ధాప్యం మరింత భారంగా మారుతుంది. బలమైన కుటుంబ వ్యవస్థతోనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. కుటుంబ వ్యవస్థ విఛిన్నం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## శ్రీవారి ఆలయం ముస్తాబు.. అర్థరాత్రి నుంచి తెరుచుకోనున్న వైకుంఠ ద్వారాలు



**తిరుపతి, పతాకం న్యూస్:** పది రోజుల ఉత్తర ద్వార దర్శనాలకు గోవిందుడి క్షేత్రం ముస్తాబైంది. సోమవారం అర్థరాత్రి శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. మంగళవారం నుంచి జనవరి 8వ తేదీన వరకు జరిగే వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్ల చేశారు. తొలి మూడు రోజులు ఈ-డిప్ విధానం మినహాయిస్తే జనవరి 2 నుంచి 8వ తేదీన వరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం భారీ బందోబస్తుతోపాటు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రధాన ఆలయంతోపాటు ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 182 గంటల్లో 164 గంటలు సామాన్య భక్తులకే: వైకుంఠ ద్వార దర్శనాలకు తిరుమల శ్రీవారి దివ్య క్షేత్రం సిద్ధమైంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావించిన టీటీడీ అందుకు అనుగుణంగా తొలిసారిగా తొలి మూడు రోజులు ప్రత్యేక దర్శనాలను అన్నింటినీ రద్దు చేసి ఈ డిప్ విధానం ద్వారా టోకెన్లు జారీ చేశారు. మిగతా రోజులు 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను రోజుకు 15 వేలు, శ్రీవాణి దర్శన టికెట్లను రోజుకు వెయ్యి చొప్పున జారీ చేశారు. మొత్తం 182 గంటల్లో 164 గంటలు సామాన్య భక్తులకే దర్శన సమయాన్ని కేటాయించారు. జనవరి 2వ తేదీ నుంచి సర్వదర్శనానికి నేరుగా వీలు కల్పించారు. పెద్దఎత్తున భక్తజనం వచ్చే అవకాశం ఉండటంతో ఔటర్ రింగ్ రోడ్డులో భారీగా ఏర్పాట్లు చేశారు. నారాయణగిరి షెడ్ల నుంచి గోగర్భం జలాశయం వరకు దాదాపు 2 కిలోమీటర్ల మేర సర్వదర్శన క్యూలైన్లు ఉండగా గోగర్భం జలాశయం నుంచి ఔటర్ రింగు రోడ్డులోని మరో కిలోమీటర్ మేర క్యూలైన్లను ఏర్పాటు చేశారు. గోగర్భం జలాశయం క్యూలైన్‌లోకి సర్వదర్శన భక్తులను అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. భక్తులు గుంపులు గుంపులుగా రాకుండా పాచికాల్వ గంగమ్మ ఆలయం వద్ద నియంత్రించి అనుమతించేలా ఏర్పాటుచేశారు. ఈ క్యూలైన్‌లో తాత్కాలిక మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం, అన్నప్రసాదాల వితరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## భారత్ వాలీబాల్ టీంకి (కెప్టెన్‌గా)ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించిన చరణ్‌కు అభినందనలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** డిసెంబర్ 3 వ తేదీ నుంచి 12 వ తేదివరకు చైనా వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ స్కూల్ ఛాంపియన్షిప్ అండర్ 15 వాలీబాల్ పోటీలో ఇండియా తరుపున టీం( కెప్టెన్ గా ) ప్రాతినిధ్యం వహించి తృతీయ స్థానం లో నిలిచి కాంస్య పతకం సాధించి జట్టు విజయం లో కీలక భూమిక వహించిన చరణ్ ప్రతిభ ను జట్టు యాజమాన్యం, ఇండియన్ వాలీబాల్ పెడరేషన్, మరియు ఆంధ్ర వాలీబాల్ సంఘం సాయిట స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఇండియా ఊ టీం ప్రశంసించింది. గత జులై నెల 12 నుంచి 19 వరకు థాయిలాండ్ వేదిక గా రెండవ ఏసియన్ అండర్ 16 టమెన్ ఊ వాలీబాల్ ఛాంపియన్షిప్ లో భారత జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా చరణ్ ను పశ్చిమ ఎమ్మెల్యే పి గణబాబు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అభినందించారు. చరణ్ చిన్నప్పటినుంచి మేనమామల ఇంట్లో పెరిగి విద్యాభ్యాసం ఉక్కు నగరం డి ఏవి స్కూల్ (1 -10) స్కూల్ తరపున వాలీబాల్ ఆటలో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. స్కూల్ యాజమాన్యం పిటి సార్ మల్లేశ్వర రావు ప్రోత్సాహంతో సాయ్ అకాడమీ( స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా)కి సెలెక్ట్ అయి సీటు సాధించి కోచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆట లో మెలుకువలు నేర్చుకొని ఇండియా తరపున ఇంటర్నేషనల్ లెవెల్ లో వాలీబాల్ గేమ్ ఆడి కాంస్య పథకాలను సాధించాడు. సూరిబాబు, మోహన్ బాబు, మేనమామల

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం: అమిత్ షా



**అస్సాం, పతాకం న్యూస్:** భారత దేశంలో ఎక్కడ ఉన్నా బంగ్లాదేశ్ చొరబాటు దారులను వెనక్కి పంపిస్తామని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీ యులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపు లకు ముప్పుగా పరిణమిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వారిని ఓటు బ్యాంకుగా చూస్తోందని ఆయన ఆరోపించారు. ఆ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తోందని విమర్శించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించిందని తెలిపారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని కొనియాడారు. రాష్ట్రంలో పాతుకుపోయిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు.


## ప్రమాదకరంగా మారిన రహదారులు..

### ఆందోళన చెందుతున్న గ్రామస్తులు



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గం గంగవరం మండలంలో ఉన్నటువంటి గ్రామాలలో నరకప్రాయంగా మారిన రహదారులను బాగు చేయాలి అంటూ గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా స్పందించండి అని ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. లక్కొండ పంచాయతీకి చెందిన గ్రామాప్రజలు తరచుగా మండలం కేంద్రంలోని ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్, హాస్పటల్, వెలుగు ఆఫీస్ రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న రహదారులతో ఇబ్బందికి గురవుతున్నామని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. లక్కొండ నుండి గంగవరం వెళ్లాలంటే గుంతల మయంగా మారిన రోడ్డు లో ప్రయాణించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. గర్భిణీలు, రోగులను ఆసుపత్రికి తీసుకు వెళ్లాలంటే జడుస్తున్నారు. అటు హాస్పటల్ కు తీసుకుని వెళ్లలేక ఇంటిలో ఉంచుకోలేక మరణాలు సంభవిస్తున్నాయని వాపోతున్నారు. 108 అంబులెన్స్ రావడానికి కూడా గంటల సమయం పడుతున్నది .లక్కొండ నుండి గొరగుమ్మి, పెద్ద గార్లపాడు వరకు ఇదే పరిస్థితి. గొరగుమ్మి, గార్లపాడు రహదారులలో ఇటీవల బస్సు ఢీకొని ద్వి చక్ర వాహన చోధకుడు మృత్యువాత పడిన విషయము తెలిసిందే. లక్కొండ,గోరగుమ్మి,గార్లపాడు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా ఉండడంతో తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డుకి ఇరువైపులా తుప్పలు పెరగడంతో మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారులు నిర్మించేందుకు చర్యలు తీసుకొని బీటీ రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని మార్చడంపై కన్నీటిపర్యంతమైన మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ సమావేశంలో సోమవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటిపర్యం తమయ్యారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని మార్చి, అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లెను చేర్చే ప్రతిపాదనపై చర్చ జరుగుతున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రాగానే మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. తన నియోజకవర్గ కేంద్రం ప్రాధాన్యం కోల్పోతుందనే ఆందోళనతో ఆయన భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డిని స్వయంగా ఓదార్చారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించడంలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను, పరిపాలనాపరమైన సవాళ్లను సీఎం ఆయనకు వివరించారు. ప్రస్తుతం రాంప్రసాద్ రెడ్డి రాయచోటి నియోజకవర్గం నుంచే ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఏపీ క్యాబినెట్ ఆమోదం

కంటతడి పెట్టుకున్నారు. ఆ సమయంలో సీఎం చంద్రబాబు మంత్రిని ఓదార్చారు. జిల్లా కేంద్రం మార్చుకుంటే తలెత్తే సాంకేతిక ఇబ్బందులు వివరించారు. రాయచోటి అభివృద్ధిని తాను చూసుకుంటానని రాంప్రసాద్ రెడ్డికి చంద్రబాబు హామీ ఇచ్చారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి కంటతడితోనే బయటకు వచ్చారు. రాంప్రసాద్ రెడ్డిని మరో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఓదార్చి తన కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లారు. మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలు దిశగా ఒకట్రెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ముందుగా నిర్ణయించిన మేరకు మదనపల్లె జిల్లాలో పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజవర్గం చేర్చాలని నిర్ణయించింది. అన్నమయ్య జిల్లాలో మూడు నియోజకవర్గాలు మాత్రమే మిగిలిపోయాయి. మూడు నియోజకవర్గాలతో జిల్లా నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నిర్వహణ భారం, రాజంపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమాలు, మరో వైపు రాయచోటిలోనే కొనసాగించాలనే డిమాండ్ల నేపథ్యంలో మధ్యమార్గంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తిరుపతి జిల్లా నుంచి గూడూరును నెల్లూరులో కలుపుతున్న నేపథ్యంలో రైల్వేకోడూరును తిరుపతి జిల్లాకు, ప్రతిపాదిత మదనపల్లె జిల్లాలోకి రాయచోటి, కడపలోకి రాజంపేట నియోజకవర్గాన్ని కలపాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల విలీనాన్ని ఆయా నియోజకవర్గాల ప్రజల్లో సంతోష వాతావరణం కనిపిస్తోంది. పెనగలూరు, చిట్వేలి మండలాలకు తిరుపతి కాస్త దూరంగా ఉండనుంది. రాయచోటి నియోజకవర్గ ప్రజలు మాత్రం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తోంది. జిల్లా కేంద్రం మదనపల్లె అయినప్పటికీ అన్నమయ్య పేరుతోనే కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అన్నమయ్య పేరును రద్దు చేశారనే అపఖ్యాతి లేకుండా ఆ పేరునే కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికార యంత్రాంగానికి సంకేతాలిచ్చారు.

## మార్పులు: మంత్రులు

లేవు, 17 జిల్లాల్లో మార్పులు జరిగాయి. రాష్ట్రంలో మొత్తం 25 మార్పులు చేశాం. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం కలిపి జిల్లా చేశాం. తిరుపతిలో కలవాలని రైల్వేకోడూరు ప్రజలు ఎప్పట్నుంచో కోరుతున్నారు. బనగానపల్లె, అడ్డరోడ్డును డివిజన్లగా ఏర్పాటు చేస్తున్నాం. చేర్పులు, మార్పులన్నీ జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉంటుంది, జిల్లా కేంద్రం మాత్రం మదనపల్లె. గతంలో పారదర్శకంగా చేసుంటే ఈ సమస్యలు వచ్చేవి కావు. రాయచోటిని మరింత అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకే ఈ మార్పులు తెచ్చాం." - మంత్రి అనగాని సత్యప్రసాద్

మరికొన్ని నిర్ణయాలు : రాజంపేట నియోజకవర్గాన్ని కడప జిల్లాలోకి మార్చేందుకు కేబినెట్ ఆమోదం, మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేయాలని నిర్ణయం. ఆదోనిని రెండు మండలాలుగా విభజించే ప్రతిపాదనకు ఆమోదం.

# ‘ఆదివాసీ కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి’



**అరకులోయ, పతాకం న్యూస్:** అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు పొందిన అరకు ఆర్గానిక్ కాఫీని పండించే ఆదివాసీ రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని, బెర్రీ బొర్రర్ వ్యాధి వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. అరకువేలి ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల అధ్యక్ష కార్యదర్శులు చిన్నబాబు, బుజ్జిబాబు మాట్లాడుతూ - అల్లూరి జిల్లా ఆదివాసీ ప్రాంతాల్లో పండించే అరకు ఆర్గానిక్ కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపు, డిమాండ్ ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాడేరు ఐటీడీఏ, కాఫీ బోర్డు నుంచి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించడం లేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ప్రకటించిన ధరలు –పార్చ్‌మెంట్ కాఫీకి కిలో రూ.450, చెర్రీ కాఫీకి రూ.270, పండు కాఫీకి రూ.70 మాత్రమేనని, ఇవి రైతులకు గిట్టుబాటు కావడం లేదని విమర్శించారు. తక్షణమే పార్చ్‌మెంట్ కాఫీకి రూ.600, చెర్రీ కాఫీకి రూ.300, పండు కాఫీకి రూ.150 చొప్పున ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అరకువేలి మండలంలోని చినలబుడు, చొంపి, పెదలబుడు, కొత్తబల్లుగుడ, డుంబ్రిగుడ మండలాల్లో సుమారు 2 వేల మంది ఆదివాసీ కాఫీ రైతులు 3 వేల ఎకరాల్లో బెర్రీ బొర్రర్ వ్యాధి సోకి తీవ్ర నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేలు మాత్రమే నష్టపరిహారం ప్రకటించినా నేటికీ చెల్లించలేదని, ఎకరాకు రూ.50 వేలు చొప్పున తక్షణం చెల్లించాలని కోరారు. అదనంగా, కేంద్ర ప్రభుత్వం పాడేరు ఐటీడీఏ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు రైతులకు అందడం లేదని ఆరోపించారు. 2023లో 10 వేల మంది రైతులు 10 వేల ఎకరాలు, 2024లో 12 వేల మంది 12 వేల ఎకరాలు, 2025లో 8 వేల ఎకరాలు కాఫీ నాట్లు, అనుసంధాన పనులు చేశారని, వీటికి సంబంధించి ఎకరాకు రూ.9 వేలు చొప్పున మూడేళ్ల ప్రోత్సాహక నిధులు సుమారు రూ.2 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని, గతంలో రూ.67 కోట్లు బకాయిలు కూడా జమ చేయలేదని విమర్శించారు. తక్షణమే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆదివాసీ కాఫీ రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## క్రైమ్,శక్తి యాప్, 112 కాల్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించిన సీఐ పైడంనాయుడు





**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరాపల్లి గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో మత్తు దార్థాలు నివారణపై సైబర్ క్రైమ్,శక్తి యాప్, 112 కాల్స్ అనే విషయాలుపై అవగాహన సదస్సు నిర్వహించిన కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.పైడంనాయుడు ఆధ్వర్యంలో దేవరాపల్లి మండల గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో దేవరాపల్లి ఎస్ఐ వి.సత్యనారాయణ, కె. కోటపాడు ఎస్సై, డి. ధనుంజయ్, ఏ. కోడూరు ఎస్సై డి.లక్ష్మీ నారాయణలతో కలిసి మత్తు పదార్థాలు నివారణ, సైబర్ క్రైమ్, శక్తి యాప్స్, 112 కాల్స్ గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో కాలేజీ ఇన్ చార్జి ప్రిన్సిపల్ ఎస్.నిర్మల మరియు ఆద్యాపకులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సిఐ విద్యార్థిని విద్యార్థులతో డ్రగ్స్‌కు మరియు మత్తు పదార్థాలుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మత్తుకు దూరంగా ఉండి, కుటుంబాలతో సహా తల్లిదండ్రులని కాపాడుకోవాలి అని సీఐ పైడంనాయుడు అన్నారు.

## సాంకేతిక లోపాలు ఉంటే తెలియజేయండి




**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఐసిడిఎస్ రావికమతం ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ టీచర్లకు పంపిణీ చేసిన ఫైజీ వర్షన్ మొబైల్ ఫోన్లలో సాంకేతిక లోపాలు ఉంటే మంగళవారం సాయంత్రం లోపల తెలియజేయాలని సిడిపిఓ మంగతాయారు ప్రకటించారు. రోలుగుంట, బుచ్చయ్యపేట, చోడవరం మండలాల్లోని అన్ని అంగన్వాడి సెంటర్లకు ఎమ్మెల్యే రావికమతం, కేఎస్ఎన్ రాజు ఇటీవల ఈ మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన విషయం తెలిసినదే. వీటి పనితీరు పై ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని, అయినప్పటికీ ఏమైనా లోపాలు ఉంటే తెలియజేయాలని ఉన్నతాధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారని సిడిపిఓ వివరించారు. ఈ మేరకు రావికమతం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలు లోపాలు ఉంటే మంగళవారం సాయంత్రం లోపల తెలియజేయాలని రోలుగుంట, బుచ్చయ్య పేట సెక్టారు సూపర్వైజర్లు ఎస్కే బేగం, హైమలత గారు స్పష్టం చేశారు.

## గోడ పోస్టర్లు ఆవిష్కరించిన సిటు నాయకులు

**గాజువాక, పతాకం న్యూస్:** విశాఖ నగరంలో మొట్టమొదటిసారిగా సిఐటియు 18వ జాతీయ మహాసభల నిర్వహణ సందర్భంగా గోడ పోస్టర్ లను చిన గంట్యాడ గాజువాక సిఐటియు ఆఫీసులో సోమవారం ఆవిష్కరించారు. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కే. ఉమామహేశ్వరరావు, గాజువాక జోన్ బాధ్యులు గొలగాని అప్పారావు, కార్యదర్శి ఎం. రాంబాబు, బంగారు నాయుడు మాట్లాడారు. 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని అవుట్సోర్సింగ్ విధానం అమలు చెయ్యొద్దని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు , డెత్ రిటైర్మెంట్ పోస్టు భర్తీ తదితర డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వంకు డిమాండ్ చేశారు. నక్క నాగరాజు అధ్యక్షులు, రాము, కె వి రమణ, అరుణ, మీనాక్షి ,కుమారి, సత్యవతి, గణేష్, రాజు, సూరిబాబు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ రెడ్ షర్ట్ వాలంటరీ కవాత్




**గాజువాక, పతాకం న్యూస్:** ఓల్డ్ గాజువాక జంక్షన్ నుండి న్యూ గాజువాక మీదుగా తిరిగి ఓల్డ్ గాజువాక జంక్షన్ వరకు సిఐటియు గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యంలో రెడ్ షర్ట్ వాలంటరీ కవాత్ నిర్వహించారు. ఈనెల 31న ప్రారంభమైన సిఐటియు 18వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఈ ప్రచారం చేపట్టారు . జనవరి 4 తేదిన గొప్ప బహిరంగ ర్యాలీ ప్రదర్శనలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు ఉద్యమించాలన్నారు. ప్రభుత్వం సంస్థలు, ఆస్తులపై ప్రైవేట్ బడా పెట్టుబడిదారుల దోపిడి నుండి రక్షించాలన్నారు. కార్మికుల హక్కుల శ్రేయస్సు కోసం , నష్టధాయికమైన 4 లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు గాజువాక జోన్ కార్యదర్శి గొలగాని అప్పారావు, ఎం. రాంబాబు, అయోధ్యరామయ్య, బంగారు నాయుడు, నూకేశ్వరరావు, రామారావు డి. రమణ, అవతారం పాల్గొన్నారు.

## బయలికించం గ్రామంలో పట్టుపడ్డ కోడిపందేల రాయుళ్లు



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలో భాగంగా బయలు కించం గ్రామంలో కోడిపందాల రాయుడు పట్టుబడ్డారు. ఆరు బైకులు మరికొన్ని కోళ్లు స్వాధీన పరుచుకున్నారు అనంతరం ఎస్సై వెంకటరమణ మాట్లాడుతూ మూగ జీవులను హింసిస్తే చట్టం ప్రకారంసెక్షన్ 11 వర్తిస్తుంది. జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం, 1960 సెక్షన్ 11 ప్రకారం, మూగ జీవులను హింసించడం, తీవ్రంగా కొట్టడం, అధిక బరువు మోపడం, గాయపరచడం, వికలాంగం చేయడం, అనవసరంగా బాధపెట్టడం వంటి చర్యలు నేరంగా పరిగణించబడతాయి. సెక్షన్ 11(1) ప్రకారం, మూగ జీవులను హింసించినట్లు నిర్ధారణ అయితే, 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా 25,000 రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు. సెక్షన్ 11(2) ప్రకారం, మూగ జీవులను హింసించడం వలన జంతువు చనిపోతే, 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా 50,000 రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు. అని తెలియజేశారు మూగజీవులను ఏం చేస్తూ కోడిపందాలను ఆడుతున్నారని తెలిసి దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై వెంకటరమణ తెలియజేశారు.

## ఘనంగా ముగిసిన వీర్ బాల్ దివస్



**అరకులోయ, పతాకం న్యూస్:** దేశము, ధర్మము కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులు బాబా జోరావర్ సింగ్, బాబా ఫతేసింగ్ అని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ అ న్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యారు ్ధలకు దేశభక్తిని బోధించాలని ఆయన సూచించారు. మహారాణిపేట దండు బజార్ ఎంవీడి హైస్కూల్ ఆవరణలో వీర్ బాల్ దివస్ కార్యక్రమం ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ ముందుగా బాబా జోరావర్ సింగ్ , బాబా ఫతేసింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి వారు ప్రసంగిస్తూ గుర్తింపు నోచుకోని అమరవీరులను నేటి యువతరానికి వారి చరిత్రను తెలియచేయుట కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. విద్యార్థులు దేశము పట్ల, ధర్మము పట్ల అంకిత భావముతో ఉండాలని కోరారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు నాటి త్యాగమూర్తుల బలిదానాన్ని నేటి యువత గుర్తుంచుకోవాలని కోరారు. యువత మాదక ద్రవ్యాలకు, హింసకు అలవాటు కావద్దని, నిత్యము యోగ, ఆటపాటల సాధన తో విజయం సాధించవచ్చని అన్నారు. ఎంవిడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాసరావు ప్రసంగిస్తూ విద్యార్థుల బాధ్యత సమాజంలోని అందరిదీ అని అన్నారు 910 విద్యార్థులకు ఇక్కడ విద్యాబోధన నిర్వహిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమం మా స్కూల్ ఆవరణలో జరగటం ఆనందదాయకమని అన్నారు.

## పేదల ఆరోగ్య రక్షణకు సీఎం సహాయనిధి నిదర్శనం: అయ్యన్న



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం నియోజకవర్గం చెట్టుపల్లి గ్రామానికి చెందిన ఎల్లేటి యానిష్ (6) పుట్టుకతోనే మూగ, చెవుడు లోపంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడికి ఆపరేషన్ చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5,30,000 నిధులు, స్పీకర్ అయ్యన్న చేతులమీదుగా మంజూరు చేశారు. ఈ నిధులతో యానిష్‌కు కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం బాలుడు కోలుకుంటుండటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద ప్రజల ఆరోగ్య రక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు సంజీవనిలా పనిచేస్తోందని తెలిపారు. చిన్నారి యానిష్ ఆరోగ్యంగా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## రికార్డు స్థాయిలో ధరలు పెరిగిన కాఫీ, మిరియాలు
### ఆనందంలో గిరిజన రైతులు



**అరకు, పతాకం న్యూస్:** వాతావరణం సంపూర్ణంగా అనుకూలించడంతో ఈ ఏడాది గిరిజన రైతుల పంట పండింది. వర్షాలు సైతం సమృద్ధిగా కురవడంతో అన్ని పంటలు ఆశాజనకంగానే పండాయి. ప్రధానంగా గిరిజన రైతులకు అధిక ఆదాయాన్నిచ్చే కాఫీ, మిరియాలు ధరలు రికార్డు స్థాయికి చేరగా, మిగిలిన రాజ్‌మా, పసుపు, పిప్పళ్లు ధరలు సైతం ఆశాజనకంగానే ఉన్నాయి. దీంతో తమ కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలోని గిరిజన రైతులకు కాఫీ, మిరియాలు సాగుతోనే అధికంగా ఆదాయం లభిస్తుంది. వరి, రాగులు, సామలు వంటి పంటలు తమ ఆహార అవసరాలకు వినియోగిస్తారు. కాఫీ, మిరియాలు ప్రధాన ఆదాయ వనరుగా భావిస్తారు. దీంతో గిరిజన రైతులు సైతం ప్రతి ఏడాది ఆ రెండు పంటలపైనే అధిక శ్రద్ధ కనబరుస్తారు. ఏజెన్సీ వ్యాప్తంగా ప్రస్తుతం 2 లక్షల 72 వేల ఎకరాల్లో కాఫీ తోటలున్నాయి. వాటిలో సుమారు 1 లక్షా 52 వేల ఎకరాల్లో ఏడాదికి 71 వేల టన్నుల కాఫీ పండ్లు దిగుబడి, సుమారుగా 17 వేల టన్నుల క్లీన్ కాఫీ ఉత్పత్తి అవుతున్నదని ఒక అంచనా. ఏడాదికి ఒక ఎకరం కాఫీ తోటతో సుమారు రూ.50 నుంచి రూ.75 వేలు ఆదాయం సమకూరుతున్నది. దీంతో కాఫీ తోటల పెంపకంపై గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు. కాఫీ తోటలకు నీడ నిచ్చేందుకు పొడుగ్గా ఉండే సిల్వర్ ఓక్ చెట్లకు మిరియాలు పాదులు అల్లుతారు. వాటిని కాఫీ తోటల్లో అంతర పంటగా ఎటువంటి పెట్టుబడి లేకుండా సాగు చేస్తారు. మిరియాలు నుంచి గిరి రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఏజెన్సీ వ్యాప్తంగా 2 లక్షల 72 వేల ఎకరాల్లో కాఫీ తోటల్లో సుమారుగా 35 వేల ఎకరాల్లోని మిరియాలు పాదులుంటాయనేది ఒక అంచనా. ఒక ఎకరం కాఫీ తోటల్లోని మిరియాలు దిగుబడి ద్వారా గిరిజన రైతులకు ఏడాదికి రూ.60 వేలు వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంటున్నారు. దీంతో కాఫీ తోటలున్న గిరిజన రైతులు మిరియాలు పాదుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ అదనపు ఆదాయం సంపాదిస్తున్నారు.

## నేడు వైకుంఠ ఏకాదశికి ముస్తాబవుతున్న మైచర్లపాలెం రామాలయం



**చోడవరం, పతాకం న్యూస్ :** మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని మైచర్లపాలెంలో శ్రీ సీతారాముల వారి ఆలయాన్ని అంగరంగ వైభవంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ ఏడాది తొలకరి పంట వరివెన్నెలతో, రంగు రంగుల పుష్పాలతో, వివిధ హంగులు తో రామాలయాన్ని కన్నుల పండువగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 16 నుండి ప్రారంభమైన ధనుర్మాసం సందర్భంగా మేలుకొలుపులు కార్యక్రమంలో ప్రతీ రోజూ వేకువ జాము 4 నుండి 6 వరకు వీధి వీధి న హరినామ సంకీర్తనలు తో శ్రీ లక్ష్మీ నారాయణ లను మేలు కొల్పుతున్నారు. గ్రామ సర్పంచ్, భజన గురువు అయిన బూరె మాణిక్యం ఆధ్వర్యంలో భక్తులు, ప్రజలు హరినామ సంకీర్తనలు చేస్తున్నారు .మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వేకువజాము నుండి ప్రత్యేక పూజలు, ఏకాహం, ఉత్తర ద్వార దర్శనంలో శ్రీ సీతారాముల దర్శనం కల్పించనున్నట్లు, 31న భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మాణిక్యం, ఆలయ అర్చకులు తెలియజేశారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన టీడీపీ నాయకులు

**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని గుంటగన్నెల పంచాయతీకి చెందిన లక్క గ్రామంలో జమున భర్త భగవాన్ అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. మృతురాలి కుటుంబానికి టీడీపీ నాయకులు మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెద్దకర్మ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు 50 కేజీల బియ్యం, చిన్న మొత్తంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతో సాటి బురిడీ కొములు నాయుడు ఎస్టీ సెల్ ప్రెసిడెంట్, టీడీపీ అరకు వ్యాలీ నియోజకవర్గం, తంగుల విశ్వనాథ్ సూపర్ సర్పంచ్, సెంట్రల్ కాపు బోర్డు మెంబర్, కిల్లో అర్జున్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కిల్లో గోపి, పిసా కమిటీ సభ్యులు, బురిడీ గాసి మరియు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెదగంట్యాడ సమస్యలు పరిష్కరించాలని పల్లాకు వినతి



**పెదగంట్యాడ, పతాకం న్యూస్:** పెదగంట్యాడ ఉక్కు నిర్వాసిత కాలనీలలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పెద్దలు, శ్రీ పెంటమాంబ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం గాజువాక శాసన సభ్యులు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావుకు వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజిలు త్వరితగతిన పూర్తి చేయాలనీ, ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, పెంటమాంబ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, కాలుష్య నివారణకు పరిష్కారం చూపాలని గ్రామ పంచాయతీ పెద్దలు ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో గోందేశీ మహేశ్వర రెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, అప్పలరెడ్డి, యేల్లేటి శ్రీనివాస రావు, మొల్లి రమణ, పిట్ట కుంచ రావు, పాల అప్పా రావు, కాకినాడ సింహాచలం, డి రామునాయుడు, గోందేశీ పెంటయ్య రెడ్డి, వై అప్పన్న రెడ్డి, పి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు..



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకు దిగజారుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌లో కొనసాగుతున్నాయి. దీంతో చలి తీవ్ర ప్రభావం చూపుతోంది. జి.మాడుగులలో 5.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా ముంచంగిపుట్టులో 6.8, పెదబయలులో 9.0, చింతపల్లిలో 9.4, పాడేరులో 9.9, అరకులోయలో 10.0, హుకుంపేటలో 10.7, కొయ్యూరులో 12.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీలో గత కొన్ని రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతుండడంతో ఏజెన్సీ వాసులు గజగజ వణుకుతున్నారు. ఉదయం పది గంటలు దాటే వరకు దట్టంగా పొగ మంచు కురుస్తుండగా.. మధ్యాహ్నం ఒక మోస్తరుగా ఎండ కాస్తున్నది. దీంతో రాత్రి పగలు తేడా లేకుండా చలి వణికిస్తోంది. జనం ఉన్ని దుస్తులు ధరిస్తూ, చలి మంటలు వేసుకుంటూ తాజా పరిస్థితులను నుంచి రక్షణ పొందుతున్నారు. అలాగే పర్యాటకులు సైతం మన్యానికి విచ్చేసి చలి, మంచు వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. జీకేవీధి మండలం సీలేరు, ధారకొండ ప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. గత రెండు రోజులుగా ఈప్రాంతంలో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. శనివారం కనిష్ఠ ఉష్ణోగ్రత 9 డిగ్రీల నమోదు కావడంతో ఈ ప్రాంత ప్రజలు చలికి గజగజలాడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల వరకు సీలేరు, ధారకొండల్లో పొగ మంచు అధికంగా కురుస్తోంది. దీంతో ఘాట్ రోడ్డులో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డుంబ్రిగుడ మండలంలో చలి తీవ్రత పెరిగింది. ప్రధాన రహదారులపై దట్టమైన పొగ మంచు అలుముకుంది. ఉదయం తొమ్మిది దాటిన మంచు తెరలు వీడలేదు. వాహనదారులకు రోడ్డు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో లైట్లు వేసుకొని నెమ్మదిగా రాకపోకలు సాగిస్తున్నారు. ముంచంగిపుట్టుమండలంలో చలి ప్రజలను గజగజలాడిస్తున్నది. ఉదయం 9 గంటలు వరకు మంచు తెరలు వీడలేదు. ముంచంగిపుట్టులో 6.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. సాయంత్రం 4 గంటలు దాటితే చలి గాలులు మొదలవుతున్నాయి. దీంతో ఎక్కడ పడితే అక్కడ చలి మంటలు కాగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

## విశాఖ నగరంలో పోలీసుల కార్డెన్ సెర్చ్




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ పోలీస్ కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు గంజాయి రవాణా మరియు నేర నియంత్రణ లో భాగంగా మహారాణిపేట పోలీసు స్టేషన్ లిమిట్స్ లో ఉన్నటువంటి ఆంటోనీనగర్ ఏరియా లో ఆదివారం మహారాణిపేట సిఐ దివాకర్ యాదవ్ మరియు పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించి రికార్డులు సరిగ్గా లేని మరియు సౌండ్ పొల్యూషన్ కలిగిన 12 టూ వీలర్స్ ను పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అదే విధంగా ఇళ్లను అద్దెకు ఇచ్చే వారికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది.

## ముగిసిన ఐబొమ్మ రవి కస్టడీ విచారణ.. కీలక వివరాలు సేకరించిన పోలీసులు..



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కస్టడీ విచారణ పూర్తయింది. ఇమంది రవి కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కీలక వివరాలు సేకరించారు. ప్రహ్లాద్ వెల్లేల పేరిట రవి పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాడు. గతంలో ప్రహ్లాద్ తన రూమ్మేట్ అని రవి పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు బెంగళూరు నుంచి ప్రహ్లాద్‌ను పిలిపించి విచారించారు. కస్టడీలో ఉన్న ఇమంది రవి ఎదుటే ప్రహ్లాద్‌ను పోలీసులు ప్రశ్నించారు. ఇమంది రవి ఎవరో తనకు తెలీదని పోలీసులకు ప్రహ్లాద్ చెప్పాడు. తన పేరుతో రవి పాన్, లైసెన్స్ తీసుకున్నట్లు తెలిసి షాక్‌కు గురయ్యానని ప్రహ్లాద్ అన్నాడు. ప్రహ్లాద్ డాక్యుమెంట్లు ఇమంది రవి దొంగలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక, గతంలో చేసిన బ్యాంక్ ట్రాన్సక్షన్లను చూపించి రవిని పోలీసులు ప్రశ్నించారు. లక్షల్లో లావాదేవీలు, డొమైన్ కొనుగోలు, ఐపీ మాస్క్ చేయడం గురించి రవిని పోలీసులు ప్రశ్నించారు సర్వర్ లోడ్ కెపాసిటీ గురించి, ఎవరెవరు ఆ సర్వర్ మైంటైన్ చేస్తున్నారు అని కూడా పోలీసులు ఆరా తీశారు. త్వరలోనే పైరసి రాకెట్‌లో మరిన్ని అరెస్టులు ఉండే అవకాశం కనబడుతోంది. కాగా, రవి 12 రోజుల కస్టడీ ఈ రోజుతో ముగిసింది. రవిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

## చింతపల్లిలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**చింతపల్లి, పతాకం న్యూస్:** కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చింతపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. చింత పల్లి మండల అధ్యక్షుడు రామ చందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ రీమల నవభారత్ ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కంకి పట్టి వీరన్న పడాల్, వంతల కన్నబాబు మరియు పార్టీ అభిమానులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ భారతదేశంలోని ఒక ప్రధాన రాజకీయ పార్టీ. ఇది 1885 డిసెంబర్ 28న ఆవిర్భవించింది. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావానికి ముందు భారతదేశంలో బ్రిటిష్ పాలన ఉండేది. భారతదేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయులు పోరాడటానికి కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించబడింది. భారతీయుల హక్కులను రక్షించడానికి పోరాడింది. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంలో ముఖ్య వ్యక్తులు ఆల్లన్ ఆక్టేవియన్ హ్యూమ్. ఆల్లన్ ఆక్టేవియన్ హ్యూమ్ కాంగ్రెస్ పార్టీ స్థాపించాడు. దాదాభాయ్ నౌరోజీ కాంగ్రెస్ పార్టీ మొదటి అధ్యక్షుడు. సురేంద్రనాథ్ బెనర్జీ కాంగ్రెస్ పార్టీ మొదటి సమావేశాన్ని నిర్వహించాడు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం భారతదేశ చరిత్రలో ఒక ముఖ్యమైన సంఘటన. భారతదేశానికి స్వతంత్రం రావటానికి ముఖ్య పాత్ర పోషించింది అని కాంగ్రెస్ యొక్క గొప్పతనాన్ని అభిమానులకు వివరించారు.

## సమన్వయంతో ముందుకువెళ్లాలి: కలెక్టర్




**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సూచించారు. పోలీసు కల్యాణ మండపంలో నార్కోటిక్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టర్, ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఎక్కడ గంజాయి సాగవుతున్నట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖలు గుర్తించినా పోలీసుశాఖకు సమాచారం అందించాలన్నారు. విద్య, ఉన్నత విద్య, సెట్విజ్, అనుబంధ శాఖలు సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం వసతిగృహంలో కూడా గంజాయి వినియోగం లేకుండా యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పోలీసులు నిర్వహించిన దాడుల్లో జిల్లాలో ఎక్కడా గంజాయి సాగువుతున్నట్టు ఎక్కడా ఆధారాలు లేవన్నారు. రవాణా జరుగుతున్న 7 మార్గాలను గుర్తించి డైనమిక్ వాహన తనిఖీలను విస్తృతం చేస్తున్నామన్నారు. సమావేశంలో డ్రగ్స్ కంట్రోల్, అటవీశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పరిషత్, అటవీశాఖ, రవాణా, అగ్నిమాపకశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, డీఎస్పీలు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో 79 మెట్రిక్ టన్నుల యూరియా

**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండల కేంద్రంలో రైతులకు అవసరమైన యూరియా రైతు సేవా కేంద్రాలు మరియు రిటైల్ అవుట్‌లెట్లలో అందుబాటులో ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సుధారాణి సోమవారం తెలిపారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంలో 12 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 67 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.వరి పంట కోతలు కొనసాగుతున్న నేపథ్యంలో అనంతరం పశుపోషణ అవసరాల కోసం పశుగ్రాసానికి, ఉద్యానవన పంటలు, కూరగాయ పంటలు మరియు వరి పంటలకు సంబంధించి యూరియా వినియోగం జరుగుతోందని తెలిపారు. రైతులు అవసరాన్ని బట్టి యూరియాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు

## స్పందించకపోతే కాలువ పూడ్చేస్తాం: హర్షకుమార్



**భోగాపురం, పతాకం న్యూస్:** మరో 48 గంటల్లో సిద్ధార్థ కాలనీ సమస్య పరిష్కా రం కాకపోతే నిర్మించిన కాలువను పూడ్చేస్తామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. మహిళలపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ ముంజేరు పంచాయతీ సిద్ధార్థ కాలనీకి చెందిన దళితులు భోగాపురంలో గత కొన్నిరోజులుగా రిలే దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షకు ఆయన హాజరై, సంఘీభావం తెలిపారు. ముందుగా ముంజేరు సిద్ధార్థ కాలనీకి వెళ్లి, అక్కడ నిర్మించిన కాలువను పరిశీలించారు. అనంతరం రిలే దీక్ష శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అసంపూర్ణంగా వదిలేసిన కాలువను పూర్తి చేయాలని, లేకపోతే గతంలో ఏవిధంగా వాడుక, మురుగు నీరు పోయేదో అదే విధంగా పోయే విధంగా చేయాలని.. వీటిలో ఏమి చేయా లో అధికారులు నిర్ణయించుకుని 48 గంటల్లో రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు. లేదంటే నిర్మించిన కాలువను పూడ్చేస్తామన్నారు. ఈ కార్యకమ్రంలో మాలల రాజ్యాధికార సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, ఆర్‌పీఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్, రాష్ట్ర, జిల్లా నాయకులు సుమారు 100 మంది పాల్గొన్నారు.

## టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో దినేశ్‌కుమార్

**పాడేరు, పతాకం న్యూస్:** పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు, వంద రోజుల విద్యా ప్రణాళిక అమలుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందస్తు ప్రణాళిక ప్రకారం పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. విద్యార్థులను మరింతగా పదును పెట్టేందుకు ఉద్దేశించిన వంద రోజుల విద్యా ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. అందుకు ఎంఈవోలు, హెచ్‌ఎంలు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో వంద రోజుల విద్యా ప్రణాళిక అమలుపై ఐటీడీఏలోని మోనటరింగ్ సెల్ ద్వారా ఏపీవోలు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. విద్యలో వెనుకబాటుకు గురైన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచి, వారిని ముందుకు తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో కె.రామకృష్ణారావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిమళ, ఎంఈవోలు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ ద్వారా పరిశుభ్రతపై అవగాహన



**గాజువాక, పతాకం న్యూస్:** కూర్మన్నపాలెం రాయల్ చెరువు వాకింగ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే స్వచ్ఛత కార్యక్రమాన్ని వనసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచిందని అన్నారు. పరిసరాలను శు భ్రంగా ఉంచుకోవడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో స్వచ్ఛతపై చైతన్యం పెరిగి ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. వనసేన కార్యకర్తలు, స్థానిక నాయకులు మరియు యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని వాకింగ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, పరి శుభ్రతను పాటించాల్సిన అవసరం ఉందని పాల్గొన్నవారు పిలుపునిచ్చారు. అనం తరం ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ కార్యక్ర మంలో ధర్మేంద్ర, నగేష్, నర్సింగ్, వెంకటేష్,చందు, రాజశేఖర్, గణేష్, రాజేష్ ,సంతోష్ సాయి, విజయ్, మంజునాథ్, మురళి ,భరత్ తోపాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రైల్వే రిజర్వేషన్ సమయాల్లో మార్పులు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారతీయ రైల్వే టికెట్ బుకింగ్ వ్యవస్థలో కీలక మార్పులు చేసింది. ఐఆర్‌సిటిసి ఖాతా ఆధార్ అనుసంధానమైన ప్రయాణికుల కోసం రిజర్వేషన్ సమయాలను పొడిగిస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధనలు సోమవారం నుండి అమలులోకి రానున్నాయి. టికెట్ బుకింగ్ వ్యవస్థలో దళారుల ఆగడాలను అరికట్టడానికి , అసలైన ప్రయాణికులకు మాత్రమే బెర్తులు దక్కేలా చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని రైల్వే అధికారులు తెలిపారు.. గతంలో జనరల్ రిజర్వేషన్ ప్రారంభమైన మొదటి 15 నిమిషాలు మాత్రమే ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ఉండేది. ఆ తర్వాత దీనిని ఉదయం 8 నుండి 10 గంటల వరకు పొడిగించారు. ఇప్పుడు ఈ సమయాన్ని మరింత పెంచుతూ రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆధార్‌తో లింక్ అయిన వినియోగదారులు మాత్రమే ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోగలిగే సమయాలను దశలవారీగా మార్చామని ఐఆర్‌సిటిసి తెలిపింది. అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఎఆర్‌పి) ప్రారంభమయ్యే రోజున, సాధారణ రిజర్వేషన్ల కోసం ఆధార్ ఆధారిత బుకింగ్‌ను అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగించారు.. దీంతో సామాన్య ప్రయాణికులకు టికెట్లు దొరుకుతాయని అధికారులు తెలిపారు. గత వారం అన్ని జోన్ల ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్లకు పంపిన లేఖలో ఈ మార్పులను స్పష్టం చేశారు. అయితే ప్రయాణికులు తమ ఐఆర్‌సిటిసి ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవడం ద్వారా మాత్రమే ఈ సదుపాయాన్ని పొందవచ్చు అని రైల్వే అధికారులు మరోసారి స్పష్టం చేశారు.

## గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం



**నెల్లిమర్ల, పతాకం న్యూస్:** రామతీర్థంలో గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ చేపట్టేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆ రోజు వేకువజాము 3 గంటలకు స్వామికి ఆరాదన, 4 గంటలకు తిరుప్పావై నిర్వహిస్తారు. 5 గంటలకు స్వామిని ఉత్తరద్వారంలో ప్రతిష్టించి దర్శనానికి అవకాశం కల్పిస్తారు. 7.30 గంటల వరకు స్వామిని దర్శించుకోవచ్చు. అనంతరం స్వామిని పల్లకీలో అధిష్టింపజేసి తిరువీధి మహోత్సవం ప్రారంభిస్తారు. ఉదయం 8 గంటలకు నీలాచలం కొండ మెట్ల వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్తారు. అక్కడ ముందుగా గోపూజ నిర్వహించాక ప్రతీ మెట్టుకు పసుపురాసి, బొట్టుపెట్టి మెట్లోత్సవం జరిపిస్తారు. 9 గంటలకు గిరిప్రదక్షిణ మొదలవుతుంది. సుమారు 8 కిలోమీటర్ల దూరముండే నీలాచలం చుట్టూ స్వామివారి ప్రదక్షిణ ఉంటుంది. ఉత్తరద్వార దర్శనం, మెట్లోత్సవం, గిరిప్రదక్షిణ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అర్చకులు కోరారు.

## టి అర్జాపురంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన



**రావికమతం, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రావికమతం మండలం టి. అర్జాపురం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొని స్వదేశీ జాతి పశువుల సంరక్షణ, అభివృద్ధిపై అవగాహన సంపాదించారు. కార్యక్రమం వివరాలు కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ గోకుల్ మిషన్ లో భాగంగా ఈ దూడల ప్రదర్శనను పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వదేశీ పశువుల ఉత్పాదకత పెంపు, మంచి జాతి దూడల పెంపకాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు, మేడివాడ కోఆపరేటివ్ చైర్మన్ గుటాల చిన్న పాల్గొని రైతులకు ఉద్దేశించి మాట్లాడారు. టి. అర్జాపురం వైస్ ప్రెసిడెంట్ సీతిన రాము, బిజెపి రావికమతం మండలం ప్రధాన కార్యదర్శి దంట్ల సత్యనారాయణ, రోలుగుంట తట్ట బంధ, కొత్తకోట పశు వైద్యాధికారులు, ఏడి పర్యవేక్షణలో కార్యక్రమ ఏర్పాట్లు జరిగాయి. కార్యక్రమం ఉదయం నుంచే దూడలతో రైతులు వచ్చి ఆరోగ్యం, జాతి గుణాత్మక తో, సంరక్షణ పద్ధతుల ఆధారంగా నిపుణులు పరిశీలించారు. ప్రదర్శనలో పాల్గొన్న పశుసంవర్ధక అధికారులు మంచి దూడల ఎంపిక, ఆహార నిర్వహణ, టీకాల ప్రాముఖ్యత పై రైతులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా స్వదేశీ జాతుల సంరక్షణ తోపాటు పాడి పరిశ్రమను లాభదాయకంగా మార్చుకోవచ్చని అధికారులు వివరించారు. ఎంపికైన ఉత్తమ దూడలకు పురస్కారాలు, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం ద్వారా మరింత మంది రైతులు ఈ మిషన్లో భాగస్వాములు కావాలని పశుసంవర్ధక శాఖ పిలుపునిచ్చింది.

# కోడి పందేలకు సిద్ధమవుతున్న గోదావరి జిల్లాలు..



**భీమవరం, పతాకం న్యూస్:** సంక్రాంతి అనగానే పల్లెల్లో పచ్చదనం, ముగ్గులు, గొబ్బెమ్మలు, బసవన్నలు, పిండివంటలు ఇలా ఎన్ని ఉన్నా కోడి పందేలది మాత్రం ప్రత్యేక స్థానం. వారూ వీరూ అనే తేడా లేకుండా అందరి చూపూ వాటి పైనే ఉంటుంది. ఈ క్రమంలో సంక్రాంతి బరిలో కాలుదువ్వేందుకు పందెంకోళ్లు సై అంటున్నాయి. బరిలే నిలిచేందుకు గాను కొన్ని నెలల పాటు వాటికి ప్రత్యేక శిక్షణను అందిస్తారు. రాటుదేలిన కోళ్లు తమ సత్తాను చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి. సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు గోదావరి జిల్లాల్లో ఎక్కువగా కోడి పందేలపై చర్చలు సాగుతుంటుంది. పండగ దగ్గర పడుతున్న తరుణంలో గ్రామాల్లో సందడి మొదలైంది. పందేల్లో పుంజులను బరిలో దించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొందరు పిల్లదశ నుంచి కోళ్లను ప్రత్యేకంగా పెంచుతుండగా, మరికొందరు మాత్రం ధర ఎంతైనా వెనుకాడకుండా కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం శిబిరాల్లోని కోడి పుంజుల క్రయ విక్రయాలు జోరందుకున్నాయి. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పందేనికి బరిలో దించేందుకు ఇప్పటికే పలు చోట్ల భారీ సంఖ్యలో కోడిపుంజులన్నీ సిద్ధమయ్యాయి. గతేడాది ఐ. పోలవరం మండలం మురమళ్లలో ఏర్పాటు చేసిన కోడి పందేల శిబిరం రాష్ట్ర స్థాయిలో మార్మోగిపోయింది. విద్యుత్తు దీపాల నడుమ భారీ ఎత్తున ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ నేపథ్యంలో పండగ మూడు రోజులూ మురమళ్లలో ఖరీదైన కార్లు చక్కర్లు కొట్టనున్నాయి. పందెం కోళ్ల కోసం ప్రత్యేకంగా శిబిరాలను ఏర్పాటు చేసి పందెం పుంజులను పెంచుతున్నారు. ఆక్వా చెరువుల వద్ద, కొబ్బరితోటల్లో జాతి పుంజుల పెంపకానికి కేంద్రాలుగా ఉన్నాయి. ఐ.పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, అల్లవరం, ఉప్పలగుప్తం, రాజోలు, సఖినేటిపల్లి, రావులపాలెం, ఆలమూరు, రామచంద్రపురం తదితర మండలాల్లోని 200కు పైగా శిబిరాలు ఉన్నట్లు ప్రాథమిక అంచనా ఉంది. అయితే కోడి పుంజుల క్రయవిక్రయాల ద్వారా రూ.40 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని స్థానికంగా ఓ అంచనా ఉంది. మరికొందరు ఇళ్ల వద్దే పుంజులను పెంచుతున్నారు.

ఈ ప్రాంతాల్లో ఈ ఏడాది సైతం మురమళ్లతో పాటు అల్లవరం, కాట్రేనికోన మండలాల్లోనూ పెద్ద బరుల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ప్రతి మండలంలో కనీసం నాలుగు నుంచి ఆరు వరకు బరులు ఏర్పాటుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. తమ గ్రామాల్లో బరి ఏర్పాటు చేసి తమ పట్టు నిరూపించుకునేందుకు స్థానిక నాయకులు సైతం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.ముఖ్యంగా కొక్కిరాయి, డేగ, కాకి డేగ, అబ్రాస్, తెలుపు, నలుపు నెమళ్లు తదితర పేర్లతో పిలిచే కోళ్లకు మార్కెట్లో గిరాకీ ఎక్కువగా ఉంది. ఇందులో భాగంగా బరుల నిర్వాహకులు 20 నుంచి 30 వరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొన్నిచోట్ల ఒక్కోదాన్ని రూ.25,000 వేల నుంచి 50,000 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. మరికొందరైతే ముందస్తుగానే డబ్బులను చెల్లించి పందేలకు కోళ్లను సిద్ధం చేసేసుకుంటున్నారు.

పందెం కోళ్లకు నిత్యం ఉడికించిన మటన్, ఉడకబెట్టిన గుడ్లు, జీడిపప్పు, రాగులు, సజ్జలు, బాదం తదితర ఆహార పదార్థాలను అందిస్తారు. అంతేకాకుండా బరువు పెరగకుండా చురుగ్గా పోరాటం చేసే విధంగా ఈ మేతను తినిపిస్తుండం గమనార్హం. అశ్వగంధ పొడిని పొగరు పెరగడానికి పట్టిస్తారు. బికాంప్లెక్స్ మాత్రలు నీటిలో వేసి తాగిస్తారు. వాతం చేయకుండా కస్తూరి మాత్రలు తమలపాకులో చుట్టి పెడతారు. తాగేందుకు, స్నానానికి వేడి నీటినే వాడతారు. అలుపు నియంత్రణలో ఉండేందుకు నీళ్లలో వదిలి వారానికి ఒకసారి పుంజుతో ఈతను కొట్టిస్తారు. వేగంగా తరుముతూ పరిగెత్తిస్తారు.

# పెరిగిన ఎరువుల ధరలు.. రైతులపై తప్పని భారం




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఎరువుల ధరలు పెరిగాయి. యూరియా, డీఏపీ తప్ప మిగిలిన అన్ని రకాల ఎరువులు బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు పెరగడంతో జిల్లా రైతులపై కోట్ల రూపాయల భారం పడనుంది. ఎరువుల ముడిసరుకును విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడం, అంతర్జాతీయ మార్కెట్‌లో వాటి ధరలు పెరగడం ఈ పరిస్థితికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పుడు పెరిగిన ఎరువుల ధరలతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రబీలో ఆరుతడి పంటలు సాగు చేయాలని అధికారులు చెబుతున్నా రైతులు మాత్రం వరి, మొక్కజొన్న సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలో 20వేల ఎకరాల్లో వరి, 35వేల ఎకరాల్లో మొక్కజొన్న, 6వేల ఎకరాల్లో వేరశనగ, 12వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. కంది, మినుము, నువ్వు, కటిక, రాగి, కూరగాయల పంటలను కూడా పండిస్తున్నారు. ఆయా పంటలకు ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎకరానికి ఆరు నుంచి 10 బస్తాలను పంటను బట్టి ఎరువు వేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇందులో యూరియా 30శాతం, పొటాష్, సూపర్ ఫాస్పేట్, మిశ్రమ ఎరువులు 70శాతం వినియోగిస్తారు. మిశ్రమ ఎరువుల్లో పొటాష్, పాస్పరస్ వంటివి ఎక్కువగా ఉంటాయి. దేశీయంగా వీటి లభ్యత లేక ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. అందుకే వీటితోపాటు ఇతర ఎరువుల ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. ఈ ధరల భారం రైతులపై పడింది. జిల్లాలో కొందరు డీలర్లు యూరియాను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వారి వద్ద మొక్కజొన్న, వరి విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు మాత్రమే యూరియాను విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే రైతులకు యూరియా ఇస్తున్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పోను 50 కేజీల యూరియా బస్తాను రూ.267కు విక్రయించాలి. హమాలీ ఖర్చుతో కలిపి గరిష్టంగా రూ.280కు అమ్మాలి. కానీ, కొందరు వ్యాపారులు బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. యూరియా కొరత కారణంగా వ్యాపారులు చెప్పిన ధరకే రైతులు కూడా కొనుగోలు చేస్తున్నారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో రైతు సేవాకేంద్రాల ద్వారా అధికారులు యూరియాను పంపిణీ చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి యూరియా సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## చోడవరం సహకార చక్కెర కర్మాగారం రైతులు, కార్మికులకు రావాల్సిన బకాయిలపై కార్యాచరణ ప్రణాళిక: ధర్నా వాయిదా

**చోడవరం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఒకప్పుడు లాభాల బాటలో నడిచే చోడవరం సహకార చెక్కర కర్మాగారాన్ని నమ్ముకొని చెరకు పంట సాగు చేస్తున్న రైతులకు, అందులో గత 20 - 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకి ఫ్యాక్టరీ మేనేజ్మెంట్ యొక్క అవినీతి చర్యల కారణంగా గత సీజన్లో చెరుకుతోలిన రైతులకు సుమారు 30 కోట్ల రూపాయలు, అదేవిధంగా కార్మికులకు సుమారుగా 8 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలని కోరుతూ సోమవారం నిర్వహించవలసిన ధర్నా వాయిదా వేసినట్లు గుర్తింపు యూనియన్ నాయకులు తెలిపారు. గత సీజన్లో మేనేజింగ్ డైరెక్టర్ ఇచ్చిన హామీ మేరకు చెరకు సాగు చేసిన రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యం మరియు అధికారుల తప్పుడు నిరయాల వల్ల చోడవరం ఫ్యాక్టరీలో ఈ సీజన్లో క్రషింగ్ చేయలేక రైతులు పండించిన చెరుకును ప్రైవేట్



ఫ్యాక్టరీకి తక్కువ ధరకు బలవంతంగా తరలిస్తున్న అధికారుల చర్యలను నిరసిస్తూ ఈనెల 29వ తారీకున అనగా సోమవారం సంబంధిత పక్షాలతో కలిసి శాంతియుతంగా భారత చైతన్య యువజన పార్టీ నేతలు కూడా మద్దతు తెలియచేయద్దామని పార్టీ అధ్యక్షులు హెూదాలో మన ప్రాంతానికి రావడం కోసం ప్రభుత్వ అనుమతి కోరుతూ డిసెంబర్ నెల 13వ తేదీన అనకాపల్లి జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ కి బీసీ వై పార్టీ అధినేత దరఖాస్తు చేసినప్పటికీ సోమవారం వరకు ఎటువంటి అనుమతి కాని, సమాచారం లేని కారణంగా చట్టాన్ని గౌరవించే పార్టీగా చట్టాన్ని గౌరవించే బాధ్యత గల వ్యక్తులుగా సోమవారం జరప తల పెట్టిన కార్యక్రమాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో వాయిదా వేయడం జరిగింది . దీనిపై తొందర్లోనే ఒక నిర?యం తీసుకుని మన ప్రాంత చెరకు రైతుల మరియు కార్మికుల సమస్యలపై బీసీవై పార్టీ తరపున పోరాటాన్ని కొనసాగించి రైతులు, కార్మికుల బకాయిలు చెల్లింపుల కోసం తిరిగి ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం అయ్యేలాగా క ృషి చేస్తామని ఆ దిశగా ఉద్యమ కార్యాచరణ చట్ట పరిధిలో అనుమతులు తీసుకుని తొందరలో చెరకు రైతుల కార్మికుల వాణిని బీసీవై పార్టీ తరపున గట్టిగా వినిపిస్తామని బి సి వై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ సుగర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిని అయిన నాకు కొద్ది సేపటి క్రితం తనకు తెలిపారన్నారు . ముందుగా అనుకున్న ప్రకారం సమావేశం అతి తొందరలో ఏర్పాటు చేసుకుని మన ఫ్యాక్టరీ రైతుల కార్మికుల సమస్యల కోసం కార్యాచరణ ప్రకటిస్తామని సుగర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (గుర్తింపు యూనియన్) అధ్యక్షుడు కె భాస్కర్ రావు తెలిపారు.

# పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు ఎలా కరుగుతుంది?

శరీరంలో హార్మోన్ల అసమతుల్యత తలెత్తినా పొట్ట పెరుగుతుంది. ఒత్తిడితో సతమతమైనా బాన పొట్ట వచ్చేస్తుంది. మహిళల్లో డెలివరీ తర్వాతా పొట్ట పెరిగిపోతుంది! ఈ విధంగా ఒబేసిటీలో పలు రకాలు ఉన్నాయి. కారణం ఏదైనప్పటికీ.. పొట్ట చుట్టూ పేరుకుపోయిన చెడు కొవ్వుతో నడుము బస్తాలా ఉబ్బిపోతుంది. చూడ్డానికి అసహ్యంగా కనిపించడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా హాని చేస్తుంది. అందుకే దీన్ని ఎంత త్వరగా తగ్గించుకుంటే అంత మేలని వైద్య నిపుణులు చెబుతుంటారు. జనం కూడా పొట్టను వెంటనే తగ్గించుకొని నాజూకైన నడుము సొంతం చేసుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. కానీ అంత ఈజీ కాదు. దీంతో ఎలా తగ్గించుకోవాలో తెలియక నానా అవస్థలు పడుతుంటారు. మీరు కూడా ఈ లిస్టులో ఉంటే నిపుణులు సూచిస్తున్న ఈ టిప్స్ తెలుసుకోండి. డెలివరీ అయ్యాక కూడా పొట్ట ఎత్తుగా కనిపించడం సర్వసాధారణం. అయినా, దీన్ని అంగీకరించడానికి చాలామంది మహిళలు ఇష్టపడరు. వెనువెంటనే పొట్ట తగ్గించుకొని తిరిగి నాజూగ్గా మారాలని ఆరాటపడుతుంటారు. దీంతో మానసికంగా కూడా ఒత్తిడికి గురవుతుంటారు. అయితే, దీనివల్ల ఆరోగ్యానికి నష్టం తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదని అంటున్నారు నిపుణులు. అందుకే ఒత్తిడికి లోను కాకుండా, చక్కటి జీవనశైలిని అనుసరిస్తే కొన్ని రోజుల్లోనే మార్పు వస్తుందని చెబుతున్నారు. ప్రసవమైన 6-8 వారాల తర్వాత గైనకాలజిస్ట్ సలహా మేరకు చిన్న చిన్న వ్యాయామాలు మొదలు పెట్టాలంటున్నారు నిపుణులు. నడక, పాపాయిని ఎత్తుకొని కాసేపు అటూ ఇటూ నడవడం, యోగా, ధ్యానం.. ఇలా కుట్లపై ఒత్తిడి పడని వ్యాయామాలు సాధన చేయాలని సూచిస్తున్నారు. అలాగే, 'కీగల్ వ్యాయామాలు' కూడా వదులైన చర్మం బిగుతుగా మారడానికి



దోహదం చేస్తాయని చెబుతున్నారు. ఇక ఆహారం విషయానికొస్తే, అవకాడో, ఆలివ్ నూనె, నట్స్, డ్రైఫ్రూట్స్ వంటి మంచి కొవ్వుల్ని తీసుకోవాలని సలహా ఇస్తున్నారు.

డెలివరీ తర్వాత పొట్ట తగ్గాలంటే, దానికి సంబంధించిన ఎక్సర్‌సైజ్‌లు చేయాల్సి ఉంటుంది. సిజేరియన్ అయిన వాళ్లు 6 వారాల తర్వాత నుంచి రెగ్యులర్ ఎక్సర్?సైజ్?లు చేయడం మంచిది. నార్మల్ డెలివరీ అయిన వాళ్లు మాత్రం 2 - 3 వారాల నుంచి రెగ్యులర్ ఎక్సర్‌సైజ్‌లు చేయవచ్చు. కొంతమందికి శరీర పైభాగం స్లిమ్‌గా ఉంటుంది. కానీ, పొట్ట దగ్గరికొచ్చేసరికి కాస్త లావుగా కనిపిస్తూ ఉంటుంది. ఎందుకంటే, ఎక్కువసేపు కూర్చొని పనిచేయడం, శారీరక శ్రమ లేకపోవడం, జంక్‌ఫుడ్-ప్రాసెస్డ్ ఫుడ్‌కు అలవాటు పడడం వంటి వాటి వల్ల పొట్ట చుట్టూ కొవ్వులు పేరుకుపోతాయంటున్నారు నిపుణులు. అలాగే, జీర్ణ సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యల వల్ల ఎప్పుడు చూసినా పొట్ట ఉబ్బరంగా కనిపిస్తుందని చెబుతున్నారు.

ఏం చేయాలంటే : పీచు అధికంగా ఉండే బీన్స్, బ్రోకలీ, బెర్రీ పండ్లు, అవకాడో, యాపిల్, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలంటున్నారు నిపుణులు. వీటిల్లోని ఫైబర్ ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుందని చెబుతున్నారు. అలాగే, నీళ్లు ఎక్కువగా తాగడం, నీటి శాతం అధికంగా ఉండే పండ్లు, కాయగూరలు తీసుకోవడం వల్ల ఫలితం ఉంటుందని సూచిస్తున్నారు. వీటితో పాటు పొట్టపై ఒత్తిడి పడే కోర్ వ్యాయామాలు, బరువులెత్తడం, మెట్లెక్కడం వంటివి సాధన చేయాలని సలహా ఇస్తున్నారు. ఫలితంగా, పొట్ట చుట్టూ పేరుకున్న కొవ్వు కరగడంతోపాటు అక్కడి కండరాలు కూడా దృఢమవుతాయని పేర్కొంటున్నారు. బెల్లీ ఫ్యాట్? తగ్గించడంలో వ్యాయామం, చురుకైన నడక, సాధారణ సైక్లింగ్ సహాపడతాయని అధ్యయనం పేర్కొంది. రోజువారీ నడక, వ్యాయామం లేకపోతే పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోయే అవకాశం ఉంది. దీంతో శరీర ఆకృతి మారడంతోపాటు, అనారోగ్య సమస్యలూ ఎదురవుతాయి. ప్రమాదకరమైన ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చెయ్యొద్దు. పిల్లలు ఆటలకు దూరమవ్వడం, సెల్?ఫోన్ చూసుకుంటూ తినడం, జంక్?ఫుడ్ లాంటివి బొజ్జ సమస్యకు కారణం. సరైన నిద్రలేకపోవడం, ఇతర వ్యసనాలు కూడా ఈ సమస్యను తెస్తాయి. -డాక్టర్ కొణతం రాంబాబు

జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్లు శరీరంలో హార్మోన్లపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. తద్వారా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుందని చెబుతున్నారు. అలాగే ఒత్తిడి, ఆందోళన కారణంగా కార్టిసాల్ స్థాయిలు కూడా పెరిగిపోతాయని హెచ్చరిస్తున్నారు. పొట్ట ఎత్తుగా కనిపించడానికి ఇది కూడా కారణమే అంటున్నారు. మరి, ఈ సమస్య నుంచి విముక్తి పొందాలంటే ఒత్తిడి తగ్గించుకోవడంతోపాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. యోగా, ధ్యానం వంటివి ఆందోళన, ఒత్తిడిని తగ్గించుకోవడానికి సహకరిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి సాధన చేయడం వల్ల రాత్రిళ్లు నిద్ర కూడా చక్కగా పడుతుందంటున్నారు. ఫలితంగా, శరీరం పునరుత్తేజితం అవుతుందని తెలియజేస్తున్నారు. ఆరోగ్యకరమైన కొవ్వులు నిండి ఉన్న చేపలు, నట్స్, డ్రైఫ్రూట్స్ వంటివి తీసుకోవాలని సూచిస్తున్నారు. అనారోగ్యకరమైన కొవ్వులు నిండి ఉండే జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, ప్యాక్ చేసిన వస్తువులు, స్నాక్ ఫుడ్స్ కు దూరంగా ఉండాలనిఅధ్యయనం పేర్కొంది.

పొట్ట పెరిగిపోవడానికి కారణమేదైనా సరే, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ద్వారా తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా, తీసుకునే ఆహారంలో చక్కెర తగ్గించడం, వ్యాయామాలు చేయడం వంటివి రోజువారీ అలవాట్లుగా మార్చుకుంటే సమస్య నుంచి త్వరగా విముక్తి పొందచ్చని పేర్కొంటున్నారు.

# సోషల్ మీడియాలో చూసి బ్యూటీ ప్రొడక్ట్స్ కొంటున్నారా?




సెలబ్రిటీలు చెప్పారనో, స్నేహితులు వాడుతున్నారనో, సోషల్ మీడియాలో చూసో చాలా మంది ప్రతి రోజు ఏదో ఒక రూపంలో సౌందర్య ఉత్పత్తులు వినియోగిస్తుంటారు. అయితే, సరైన అవగాహన లేకుండా వాడుతున్న వివిధ సౌందర్య ఉత్పత్తులు చర్మంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు చూపుతాయని నిపుణులు అంటున్నారు. సహజ పదార్థాల కంటే సింథటిక్, రసాయన ఆధారిత సౌందర్య సాధనాలు వినియోగిస్తున్న వారు ప్రమాదాలకు గురవుతారని.. సింథటిక్ ఉత్పత్తుల వినియోగంతో క్యాన్సర్, శ్వాసకోశ, నాడీ సంబంధిత సమస్యలు తలెత్తుతాయని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని అంటున్నారు. ఈ క్రమంలో సౌందర్య సాధనాలు మోతాదు మించితే ఎలాంటి ప్రమాదం ఉంటుందో ఇప్పుడు తెలుసుకుందాం! దేశంలో చర్మ సంరక్షణ ఉత్పత్తులకు చేస్తున్న మొత్తం ఖర్చులో ఎక్కువ భాగం 'స్కిన్ లైటెనింగ్ క్రీమ్'లకే ఖర్చవుతోందని పలు నివేదికల్లో వెల్లడైంది. ఇవి సులువుగా ఔషధ దుకాణాల్లో దొరుకుతున్నాయి. ఈ క్రీమ్?లలో వినియోగించే పదార్థాల పూర్తి జాబితాను అరుదుగా వెల్లడిస్తున్నారు. చర్మానికి సరిపడకపోయినా, మోతాదు మించినా వాటిలో వాడే కొన్ని పదార్థాలు దుష్ప్రభావాలు కలిగిస్తున్నాయి. కొందరు సోషల్ మీడియాల్లో చూసి ఇష్టానుసారం వివిధ ఉత్పత్తులు వాడేస్తున్నారు. సెలబ్రిటీలతో తీర్చిదిద్దే ప్రకటనలు వీరిని మరింత ఆకర్షిస్తున్నాయి. వారు సూచించిన క్రీమ్?లు మన చర్మానికి సరిపడొచ్చు లేదా పడకపోవచ్చు. వాస్తవానికి ఏదైనా సమస్య ఉంటే నేరుగా చర్మవ్యాధుల నిపుణులను సంప్రదించాలి. చర్మం రకాలు, వయసు, ఆహారపు అలవాట్లు, నిద్ర, ఆరోగ్య సమస్యలు తదితరాల ఆధారంగా వారు చికిత్స చేస్తారు. సన్‌స్క్రీన్ వినియోగంపై అందరికీ ఆసక్తి పెరిగింది. కానీ ఒకే ప్రొడక్ట్ అందరికీ సరిపడదని నిపుణులు చెబుతున్నారు. ఇష్టమొచ్చిన క్రీమ్ వాడితే చర్మంపై దురద, పగుళ్లు వచ్చే ప్రమాదముందని అంటున్నారు. చర్మ సంబంధిత సమస్యలకు వైద్యులు సూచించిన ఔషధాలు, క్రీమ్?లను ఎలా వినియోగించాలో పూర్తిగా తెలుసుకోవాలని సూచిస్తున్నారు. చాలామంది ఔషధాలతో సమస్య నయమవుతుందని భ్రమపడతారు. కేవలం అవే కాకుండా, శరీరంలో తక్కువగా ఉన్న పోషకాలు, విటమిన్లను ఆహారం ద్వారా భర్తీ చేయడానికి ప్రయత్నించాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. చర్మం శరీరంలోని అన్ని అవయవాలను కప్పి ఉంచుతుంది. దీని సమస్యలకు ఇష్టమొచ్చిన క్రీమ్‌లు వాడొద్దు. రోజూ కనీసం 3 లీటర్ల నీరు తాగాలి. చర్మ ఆరోగ్యానికి ప్రధాన కారణం కొల్లాజెన్, యాంటీ ఆక్సిడెంట్లు, ఇవి ఎక్కువగా ఉండే రంగుల పండ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలు తదితరాలు ఆహారంలో భాగం చేసుకోవాలి. శరీరంలోని విషతుల్యాలను తొలగించడానికి రోజూ కనీసం 20 నిమిషాలు వ్యాయామం చేయాలి. 6 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. ఇప్పుడు వయసు తక్కువగా కనిపించడానికి 'రెటినాల్' ఎక్కువగా వినియోగిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. దీన్ని తొలిసారిగా వినియోగించేవారు 0.1 శాతం ఉన్న క్రీమ్ ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు. మొటిమలుంటే 'సాల్సిలిక్ యాసిడ్', నల్లమచ్చలు వస్తే 'నియాసినమైడ్' ఆధారిత ఉత్పత్తులు వాడుతున్నారని, ఎంత మోతాదు అనేది పట్టించుకోవట్లేదని పేర్కొంటున్నారు. కొన్ని రకాల మొటిమలకు డాక్టర్లు బెంజాల్ పెరాక్సైడ్?ను సూచిస్తుంటారు. దీన్ని ఇయర్ బడ్ లేదా దూది సహాయంతో ప్రభావిత ప్రాంతంలోనే జాగ్రత్తగా రాయాలని సలహా ఇస్తున్నారు. ఆన్‌లైన్ మార్కెట్లు, డిపార్ట్‌మెంట్ స్టోర్లలో 'కెమికల్ పీల్స్' అందుబాటులో ఉంటున్నాయి. వాటిని డెర్మటాలజిస్ట్ సూచిస్తేనే వాడాలని చెబుతున్నారు. చర్మం హైడ్రేట్ కావడానికి ఫేస్‌మాస్క్‌లు వాడొచ్చని తెలియజేస్తున్నారు. హైడ్రా ఫేషియల్, ఆక్సిజీనియో ఫేషియల్ అంటూ కొన్ని బ్యూటీ పార్లర్లలో తక్కువ ధరకే సర్వీసులు అందిస్తున్నారు. అలాంటి వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని అంటున్నారు నిపుణులు.

# ఏపీలో కొత్తగా 707 మొబైల్ టవర్లు!



**అమరావత్లి, పతాకం న్యూస్:** కొన్ని ప్రాంతాల్లో ఫోన్ మాట్లాడుతుంటే మధ్యలోనే వాయిస్ కట్ అయిపోతుంటుంది. 'హలో హలో సరిగా వినిపిస్తోందా. కొంచెం ఆగు, బయటకు వస్తున్నా. లేకపోతే ఇక్కడ సిగ్నల్ లేదు. వేరేచోటుకి వెళ్లాక చేస్తా' ఇలాంటి మాటలెన్నో మనం అప్పుడప్పుడు వింటుంటాం. రాష్ట్రంలోని కొన్ని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు ఇలాంటి సిగ్నల్ సమస్య ఎదురవుతోంది. ప్రపంచం ఓ పక్క 5జీ సాంకేతికతతో పరుగులు పెడుతుంటే, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నేటికీ పూర్తిస్థాయిలో సెల్ టవర్? సేవలు అందట్లేదు. ఈ సిగ్నల్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

రాష్ట్రంలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తోంది. ఇందుకోసం కొత్తగా 707 సెల్ టవర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యింది. 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద కేంద్రం కొత్త సెల్‌టవర్ల ఏర్పాటుకయ్యే వ్యయాన్ని భరిస్తుండగా, అందుకోసం స్థలాన్ని రాష్ట్రప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ పథకం కింద ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థలు ఎయిర్‌టెల్, జియో టవర్లు ఏర్పాటు చేయనున్నాయి.

సిగ్నళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు : మారుమూల ప్రాంతాల్లో సిగ్నళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా అత్యవసర ఫోన్? కాల్? చేయాలనుకున్నప్పుడు నగరాల్లో, పట్టణాల్లో ఉన్న వారికి ఏ సమస్య రావడం లేదు కానీ మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజు రోజుకు సెల్‌ఫోన్ల సంఖ్య పెరగిపోవడంతో ఇప్పుడున్న టవర్ల సామర్థ్యం సరిపోవడం లేదు. అలాంటి చోట్లా సిగ్నల్ సమస్య ఎదురవుతోంది. ప్రజలకు ఎదురయ్యే ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలతో పాటు తరచూ సిగ్నల్ సమస్యలు ఎదురయ్యే ప్రాంతాల్లో కొత్తగా టవర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు రెవెన్యూ స్థలాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ భూములు సేకరించాల్సిన అవసరం ఉంటుంది.

కొన్నిచోట్ల టవర్లు ఏర్పాటు చేయడానికి సామగ్రిని తరలించడానికి సరైన రోడ్డుమార్గం కూడా లేదు. ఇది కొత్తగా టవర్లు ఏర్పాటు చేయడానికి ఇబ్బదికరమైన విషయం. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని చాలా గిరిజన గ్రామాల్లో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సమస్య ఎక్కువగా ఉంది. ఆ ఒక్క జిల్లాలోనే 100 టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో 42 లొకేషన్లలో అధికారులు జాయింట్ సర్వే పూర్తి చేశారు. మరో 13 స్థలాలను టవర్ల ఏర్పాటు కోసం ఆయా సంస్థలకు అప్పగించారు.

రాష్ట్రవ్యాప్తంగా తరచూ సిగ్నల్ సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. నెట్‌వర్క్ వినియోగం పెరగడంతో ఆయా ప్రాంతాల్లోని టవర్ల సామర్థ్యం సరిపోవడం లేదు. ఈ కారణం దృష్ట్యా అక్కడ అదనంగా టవర్లు ఏర్పాటు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా 4జీ నెట్‌వర్క్ విధానంలో 624 కొత్త టవర్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. కొత్త జిల్లాల ప్రాతిపదికగా వీటి ఏర్పాటుకు అధికారులు ఇప్పటికే స్థలాలను గుర్తించారు. 295 ప్రాంతాల్లో సంయుక్త సర్వే పూర్తవగా 37 లొకేషన్లను టవర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.

మారుమూల గ్రామాల్లోని ప్రజలకు టవర్? సిగ్నళ్లు అందుబాటులో లేని విషయాన్ని ప్రభుత్వం గుర్తించి టవర్లను ఏర్పాట్లు చేస్తోంది. ఇన్ని రోజులు ఫోన్ మాట్లాడేటప్పుడు సిగ్నళ్లు అందక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల సిగ్నల్ కష్టాలు తీరినట్లే అని నిపుణులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు వెళ్తోందని ప్రభుత్వ చేపట్టే కార్యక్రమాలతో స్పష్టం అవుతోంది.

# ఆరావళి మైనింగ్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
## స్వాగతించిన కేంద్రం, కాంగ్రెస్



**న్యూఢిల్లీ పతాకం న్యూస్:** ఆరావళి పర్వతాల్లో గనుల తవ్వకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. 100 మీటర్లలోపు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు అనుమతులు ఇస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వుల వరకూ గత ఆదేశాలను నిలిపివేస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా నిర్ణయంం తీసుకుంది. ఆరావళి పర్వతాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆమోదించిన నిర్వచనంపై వివాదం చెలరేగడంతో ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఆరావళి పర్వత శ్రేణులను క్షుణ్ణంగా అధ్యయనం చేయడం కోసం పర్యావరణ కార్యదర్శి నేత ృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు సుప్రీం ఆదేశించింది. నాలుగు రాష్ట్రాల సీఎస్‌లను ఈ కమిటీలో సభ్యులుగా నియమించుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ ముప్పునకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది. కొత్త కమిటీ నివేదిక వచ్చే వరకు నవంబర్ 20న ఇచ్చిన తీర్పును నిలిపివేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశంపై తగిన వివరణ ఇవ్వాలని కేంద్రంతో పాటు దిల్లీ, రాజస్థాన్, గుజరాత్, హరియాణా రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 21కి వాయిదా వేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ స్వాగతించారు. ఆరావళి పర్వతాల పరిరక్షణ, పునరుద్ధరణకు కేంద్రం కట్టుబడి ఉందని వెల్లడించారు. ఈ సమస్యను అధ్యయనం చేసేందుకు కొత్త కమిటీని నియమించడాన్ని ఆయన స్వాగతించారు.




# న్యూజిలాండ్ వన్డే సిరీస్..
## కీలక ప్లేయర్లు దూరం!



న్యూజిలాండ్ క్రికెట్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. జనవరి 11నుంచి టీమిండియాతో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. అయితే టీ20 జట్టును ప్రకటించిన బీసీసీఐ.. వన్డే జట్టును ప్రకటించాల్సి ఉంది. అయితే ఇందులో స్టార్ ప్లేయర్లకు విశ్రాంతి ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచ కప్ 2026కి ముందు న్యూజిలాండ్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా జనవరి 11 నుంచి మూడు వన్డేలు ఐదు టీ20లు ఆడనుంది. అయితే ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్న ప్రపంచ కప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ మెగా టోర్నీకి సంబంధించిన భారత జట్టును ఇటీవలే బీసీసీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. అదే టీమ్ న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లో పాల్గొననుంది. అయితే న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు సంబంధించి భారత జట్టును ఇంకా ప్రకటించలేదు.

ఈ నేపథ్యంలో ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. టీమిండియా స్టార్ ప్లేయర్లు బుమ్రా, హార్దిక్ పాండ్యకు వన్డే సిరీస్‌కు విశ్రాంతి ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా, టీ20 ప్రపంచ కప్ 2026ను దృష్టిలో పెట్టుకుని.. ఆ సమయానికి వారు ఫిట్‌గా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ స్థానంలో దేశవాళీల్లో అదరగొడుతున్న ఇషాన్ కిషన్‌లేదా జితేశ్ శర్మను జట్టులోకి తీసుకోనున్నట్లు సమాచారం. అయితే ఇషాన్ కిషన్‌కే ఈ అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ ఈ విషయంపై బీసీసీఐ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. హార్దిక్ పాండ్య.. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ తర్వాత మళ్లీ వన్డే జట్టులోకి రాలేదు. అలాగే బుమ్రా 2023 ప్రపంచ కప్ తర్వాత నుంచి వన్డేల్లో ఆడలేదు.

# రిటైర్‌మెంట్ ప్రకటించిన న్యూజిలాండ్
## స్టార్ ప్లేయర్ డగ్ బ్రేస్‌వెల్



న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ డగ్ బ్రేస్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించినట్లు ఐసీసీ వెబ్‌సైట్ సోమవారం వెల్లడించింది. 35 ఏళ్ల బ్రేస్‌వెల్ 2011 నుంచి 2023 వరకు బ్లాక్‌క్యాప్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. తన కెరీర్‌లో బ్రేస్‌వెల్ 28 టెస్టులు, 21 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 74 వికెట్లు, వన్డేల్లో 26 వికెట్లు, టీ20ల్లో 20 వికెట్లు సాధించాడు. బ్యాటింగ్‌లోనూ కీలకంగా నిలిచిన అతడు టెస్టుల్లో 568, వన్డేల్లో 221, టీ20ల్లో 126 పరుగులు చేశాడు. బ్రేస్‌వెల్ చివరిసారిగా 2023లో వెల్లింగ్టన్‌లో శ్రీలంకతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ తరఫున ఆడాడు. ఇటీవల రిబ్ గాయం బారిన పడి దేశవాళీ జట్టు తరఫున కూడా ఇకపై ఆడలేనని నిర్ణయించుకున్నాడు. న్యూజిలాండ్ క్రికెట్ అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా బ్రేస్‌వెల్ రిటైర్మెంట్ విషయాన్ని ప్రకటించింది. 2011లో హోబార్ట్ వేదికగా ఆస్ట్రేలియాపై న్యూజిలాండ్ సాధించిన చారిత్రక టెస్ట్ విజయంలో బ్రేస్‌వెల్ కీలక పాత్ర పోషించిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో అతడు 6 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 7 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

తన కెరీర్‌పై బ్రేస్‌వెల్ స్పందించాడు. 'క్రికెట్ నా జీవితంలో గర్వించదగ్గ ఓ భాగం. చిన్నప్పటి నుంచి క్రికెట్ ఆడటం అనేది నా కల. న్యూజిలాండ్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం నా అదృష్టం. ఫస్ట్‌క్లాస్, అంతర్జాతీయ క్రికెట్ ఆడటం ఒక గౌరవం. ఇన్ని సంవత్సరాలు ఆటను ఆస్వాదించినందుకు కృతజ్ఞుడిని' అని బ్రేస్‌వెల్ తెలిపాడు.




# ప్రేమలో మోసపోయా: ఇనయా సుల్తానా



ఇనయా సుల్తానా .. ఇంతవరకూ చేస్తూ వెళ్లింది చిన్న చిన్న పాత్రలే అయినా, యూత్ లో తనకి క్రేజ్ ఉంది. 'బిగ్ బాస్ 6' లోను కనిపించి సందడి చేసిన ఇనయా, తాజాగా 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గురించిన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "నేను ఊరు నుంచి వచ్చాను .. ఎలా ఉండాలి .. ఎలా మాట్లాడాలి .. ఎలా కనిపించాలి అనే విషయాలు కూడా అప్పటికి నాకు తెలియదు. కానీ ఆ తరువాత నేర్చుకుంటూ వచ్చాను" అని అన్నారు. 'బిగ్ బాస్ సీజన్ 6'లో నేను ఉన్నాను. 14 వారాల పాటు సందడి చేశాను. ఆ తరువాత కూడా నాకు సినిమాలలో ఛాన్సులు రాలేదు. దాదాపు ఏడాది పాటు ఏ సినిమా చేయలేదు. డిప్రెషన్ లోకి వెళ్లిపోతానేమోనని భయం వేసింది. దాంతో మళ్లీ సినిమా ఆఫీసుల చుట్టూ తిరగడం మొదలుపెట్టాను. అప్పుడే మళ్లీ అవకాశాలు రావడం మొదలైంది. అయితే అలా నేను చేసిన సినిమాలలో చాలా సీన్స్ ఎడిటింగ్ లో పోవడం బాధను కలిగించింది" అని చెప్పారు. "నాకెవరూ లేరు అనే ఒక ఒంటరి తనం నన్ను వేధించేది. నా మనిషి .. అనేవారు ఒకరు తోడుగా ఉంటే బాగుండేది అనిపించింది. ఆ సమయంలో నేను ఒకరి ప్రేమలో పడిపోయాను. అతనినే పెళ్లి చేసుకోవాలని అనుకున్నాను. అన్నిరకాలుగా నేను అతనిని నమ్ముతూ వెళ్లాను. అయితే ఆ వ్యక్తి నన్ను మోసం చేశాడు. నేను చేసిందే పొరపాటు .. నాదే తప్పు అనే విషయం అర్థం కావడానికి నాకు కొంత సమయం పట్టింది"అని అన్నారు.

## సినిమా టికెట్ల ధర పెంపుపై

# మాధురి దీక్షిత్ ఆసక్తికర వ్యాఖ్యలు



ఒకప్పుడు సినిమా చూడాలంటే థియేటర్ ఒక్కటే మార్గం. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా కరోనా తర్వాత థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీనికి అసలు కారణా లేంటో బాలీవుడ్ అందాల నటి మాధురీ దీక్షిత్ విశ్లేషించారు. విపరీతంగా పెరిగిపోయిన సినిమా టికెట్ల ధరలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల అందుబాటు వంటి అంశాలు ప్రేక్షకులు థియేటర్లకు దూరం కావడానికి ప్రధాన కారణాలని ఆమె అభిప్రాయ పడ్డారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా థియేటర్లకు వస్తారు. ఈ మధ్య కాలంలో కొన్ని సినిమాలు ఎంత పెద్ద విజయం సాధించాయో మనం చూశాం. కాబట్టి, జనం రావడం లేదనడం సరికాదు. కానీ అసలు సమస్య టికెట్ ధరలతోనే ఉంది. ప్రస్తుతం ఒక కుటుంబం అంతా కలిసి సినిమాకు వెళ్లాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఏ సినిమాకు వెళ్లాలి, ఏది వాయిదా వేయాలి అని వాళ్లు ప్రత్యేకంగా బడ్జెట్ వేసుకోవా ల్సిన పరిస్థితి ఏర్పడింది" అని మాధురీ దీక్షిత్ వివరించారు. ఓటీటీల ప్రభావం గురించి మాట్లాడుతూ, "ఓటీ టీల వల్ల సినిమాలు ఇప్పుడు మన చేతి వేళ్లపైనే అందు బాటులో ఉన్నాయి. ఉద్యోగాల నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి 8:30 లేదా 9:00 అవుతోంది. ఆ తర్వాత మళ్లీ థియేటర్‌కు వెళ్లడం చాలా మందికి కష్టంగా మారింది. దీంతో వారాంతాల్లో లేదా సెలవు రోజుల్లో మాత్రమే సినిమాకు వెళ్లేందుకు అవకాశం దొరుకుతోంది. అదే ఓటీటీలో అయితే, మనకు నచ్చిన సమయంలో, నచ్చిన చోట సినిమా చూసే సౌలభ్యం ఉంది. పైగా ఇంట్లోనే పాప్‌కార్న్ వంటివి తయారు చేసుకుని, కుటుంబంతో కలిసి సినిమా చూడటం తక్కువ ఖర్చుతో కూడుకున్న పని" అని తెలిపారు.






# మార్చి 6న అల్లు శిరీష్ వివాహం



టాలీవుడ్ నటుడు, అల్లు ఫ్యామిలీ హీరో అల్లు శిరీష్ ఓ ఇంటివాడు కాబోతున్నారు. త్వరలోనే తాను పెళ్లి చేసుకోబోతున్నట్టు సోమవారం అధికారికంగా ప్రకటించారు. తన కాబోయే భార్య నయనికా రెడ్డి అని వెల్లడించిన శిరీష్, మార్చి 6న తమ వివాహం జరగనుందని తెలిపారు. విశేషమేమిటంటే, సరిగ్గా ఇదే రోజున ఆయన సోదరుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్నేహారెడ్డిల వివాహం జరిగింది.

ఈ తేదీ ఖరారవడంపై అల్లు శిరీష్ స్పందించారు. "మా జాతకాల ప్రకారం పెళ్లికి రెండు మంచి తేదీలు వచ్చాయి. ఒకటి ఫిబ్రవరి 25 కాగా, మరొకటి మార్చి 6. మాకు అందుబాటులో ఉన్న వెన్యూను బట్టి మార్చి 6వ తేదీ ఖరారైంది. ఆ తర్వాతే మాకు ఈ సంతోషకరమైన యాదృచ్ఛిక విషయం తెలిసింది" అని ఆయన వివరించారు.

అన్నయ్య పెళ్లి రోజే తన వివాహం జరగనుండటంపై శిరీష్ సంతోషం వ్యక్తం చేశారు. "మా అందరికీ ఎంతో ముఖ్యమైన రోజున నా పెళ్లి జరగడం ఒక ఆశీర్వాదంగా, విధిరాతగా భావిస్తున్నాను. అన్నయ్య, స్నేహ వదిన కలిసి నిర్మించుకున్న జీవితం, వారి మధ్య ఉన్న ప్రేమ, గౌరవం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. నయనికతో నా కొత్త జీవితంలో కూడా అలాంటి ప్రేమ, గౌరవం, అవగాహనతో కూడిన ప్రయాణాన్ని కోరుకుంటున్నాను" అని శిరీష్ పేర్కొన్నారు.

తన మేనకోడళ్లు, మేనల్లుళ్లతో కలిసి చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ రీల్ ద్వారా శిరీష్ ఈ శుభవార్తను అభిమానులతో పంచుకున్నారు. కాగా, శిరీష్ 2013లో 'గౌరవం' సినిమాతో హీరోగా అరంగేట్రం చేసి 'కొత్త జంట', 'శ్రీరస్తు శుభమస్తు', 'ఊర్వశివో రాక్షసివో' వంటి చిత్రాలతో గుర్తింపు పొందారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**